క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


నిర్మాణ దశలో సీసీ డ్రెయిన్

రాజాం: నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏఈ వెంకట్ సూచించారు. స్థానిక పట్టణ పరిధిలోని సారధి రోడ్డులో రూ.11 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్ నిర్మాణం శుక్రవారం చేపట్టారు. పట్టణంలోని మురుగునీటిని తరలించేందుకు వీలుగా సారధి గెడ్డలోకి కాలువను అనుసంధానం చేస్తూ నిర్మాణం చేస్తున్నామని ఏఈ తెలిపారు.

చంద్రన్న కానుకలేవీ?

బొబ్బిలి: తాము అధికారంలోకి వస్తే చంద్రన్న కానుకలు ఇస్తామన్న సీఎం చంద్రబాబునాయుడు.. సంక్రాంతి పండగ సమీపిస్తున్నా చంద్రన్న కానుక ఊసే లేదని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు అన్నారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 2014లో తెల్లరేషన్ కార్డుదారులకు కందిపప్పు, గోధుమపిండి, సేమియా, బెల్లం, నెయ్యి తదితర నిత్యావసర సరుకులను ఓ సంచిలో పెట్టి ఇచ్చేవారని, అదే మళ్లీ కొనసాగిస్తామని చెప్పి, ఇప్పుడు ఇవ్వకుండా ఉండడం ఏంటని ప్రశ్నించారు. ఎన్నికల హామీలు నెరవేరిస్తేనే ప్రజల్లో విశ్వాసం ఉంటుందని హితవుపలికారు.

శిక్షణకు సర్వీస్ ప్రొవైడర్ల ఎంపిక

బొబ్బిలి/రాజాం సిటీ: పట్టణంలోని సత్యనారాయణపురం సచివాలయం వద్ద మెప్మా విభాగంలో స్వయం ఉపాధి శిక్షణ నిమిత్తం సర్వీస్ ప్రొవైడర్ల ఎంపిక శుక్రవారం నిర్వహించారు. ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, బ్యూటీషియన్, సెలూన్, కార్పెంటర్, ఫ్రిజ్, కూలర్, ఏసీ, టీవీ రిపేర్లకు సంబంధించి, శిక్షణ కోసం 100 మందిని ఎంపిక చేశారు. వీరంతా రూ.వెయ్యి చెల్లించి, విజయనగరంలో జరిగే స్కిల్ అప్‌గ్రేడేషన్ శిక్షణ మూడు నెలల పాటు పొందాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. శిక్షణానంతరం గుర్తింపుకార్డులు అందిస్తామని, ఆ తర్వాత పలువురికి సర్వీస్ అందించి, చార్జీలు వసూళ్లు చేసుకోవచ్చన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రేగిడి: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సోహినీరాఘవ్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యదర్శులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలతో శుక్రవారం సమావేశమైన ఆమె.. గ్రామ పంచాయతీల వారీగా జ్వరాలపై సమీక్షించారు. ఏయే గ్రామంలో ఎంతమంది జ్వరపీడితులు ఉన్నారు.. వారికి ఏ జ్వరం వచ్చిందన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు విజృంభించకుండా పరిశుభ్రత చర్యలు చేపట్టేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వంగర: మండల కేంద్రంలో ఏపీ పంచాయతీ రాజ్ మినిస్ట్రీయల్ ఎంప్లాయిస్ అసోసియేషన్-2025 క్యాలెండర్‌ను ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లోపింటి త్రినాద్, అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి దూబ కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జానపద కళల ప్రదర్శనలు

రాజాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జానపద కళల ప్రదర్శన శనివారం నిర్వహిస్తున్నట్లు రాజాం ప్రాంతీయ జానపద కళాకారుల సంఘం ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హరికథ, తప్పెటగుళ్లు, రేలారే రేలా, పందిరిపాట, శివభాగవతం, జముకుల పాట, బుర్రకథ తదితర ప్రదర్శనలు ఉంటాయన్నారు. అనంతరం కళాకారుల సన్మాన కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు9515958029ను సంప్రదించాలని కళాకారులు లింగం శారద, దూడల ప్రవీణ, సూరిశెట్టి శ్రీలక్ష్మి, చల్లా పోలిరాజ్‌లు తెలిపారు.

పంటలను సంరక్షించుకోవాలి

రేగిడి: రబీ సాగులో భాగంగా పండిస్తున్న అపరాల పంటలను సంరక్షించుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని నాయిరాలవలస, లక్ష్మీపురం గ్రామాల్లో రైతులు పండిస్తున్న మినప, మొక్కజొన్న పంటలను ఆయన శుక్రవారం పరిశీలించి, అధిక దిగుబడుల సాధనకు పలు సూచనలు చేశారు. మినప పంటకు పురుగులు ఆశిస్తుంటాయని, అర లీటరు మోనో ప్రోటోపాస్ ద్రావణాన్ని ఎకరాకు వంద లీటర్లు నీరు కలిపి పిచికారీ చేయాలన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంస్థల వద్ద పనస, కొబ్బరి, జామ, వాటర్ యాపిల్ వంటి మొక్కలను శుక్రవారం నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు.

పోషకాలతో పశుసంపద

- చలికాలంలో జీవాలు జరభద్రం
- అనారోగ్యం బారినపడకుండా కాపాడుకోవాలి
- తగిన మోతాదులో పోషకాలు అందివ్వాలి
- జాగ్రత్తలు పాటిస్తేనే పశుసంపద సాధ్యం


ఆవులకు పచ్చగడ్డిని మేతగా పెడుతున్న పెంపకందారు

రామభద్రపురం: చలికాలంలో మూగజీవాలు తరచూ అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉంటాయి. ఇలాంటి సమయంలో జీవాల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహిస్తే పశుసంపద సాధ్యమని అధికారులు సూచిస్తున్నారు. అనారోగ్యానికి గురికాకుండా చూడడంతో పాటు సకాలంలో తగిన పోషకాలు కలిగిన ఆహారం అందిస్తే పాలఉత్పత్తి గణనీయంగా పెరిగి, పశుసంపద వృద్ధి చెందుతుందని చెబుతున్నారు. పిండిపదార్థాలు, మాంసపుకృత్తులు, కొవ్వులు, విటమిన్లు, నీరు, ఖనిజ లవణాలు.. పోషకాలలో ముఖ్యమైనవి కాగా వీటిని జీవాలకు అందేలా చూస్తే చాలు అని, అవి ఆరోగ్యవంతంగా ఉండి, పశు సంపదను మనకు అందిస్తాయని పశుసంవర్థక శాఖ అధికారులు సలహా ఇస్తున్నారు.

మాంసపుకృత్తులు..

శరీర నిర్మాణానికి, పెరుగుదలకు, రోగ నిరోధకశక్తికి, హిమోగ్లోబిన్ రవాణాకు ఇవి తోడ్పడతాయి. శరీరానికి శక్తిని సైతం సరఫరా చేస్తాయి. పడ్డలు, పెయ్యల ఎదుగుదలకు, పాడిపశువుల్లో పాల దిగుబడికి దోహదపడతాయి. ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు బక్కచిక్కిపోవడం, పెరుగుదల స్తంభించడం, అండాశయాలు చిన్నగా ఉండడం, ఆలస్యంగా యుక్తవయసుకు రావడం, వ్యాధి నిరోధకశక్తి తగ్గడం, కండరాల బలహీనత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. పత్తిగింజలు, కొబ్బరి పిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి, మాంసంపొడి వంటి ముడిపదార్థాల్లో, పప్పు జాతికి చెందిన పశుగ్రాసాల్లో ఇవి సమృద్ధిగా లభిస్తాయి.

పిండిపదార్థాలు..

శరీరంలో కొవ్వునిల్వలు.. అంతర్గత అవయవాలను దెబ్బల నుంచి కాపాడుతాయి. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. ఆహారంలో రుచిని పెంపొందిస్తాయి. అలాగే పశువుల సక్రమ పునరుత్పత్తిలో మాంసపుకృత్తుల కన్నా కొవ్వులు అందించే శక్తి ముఖ్యమైనది. కొవ్వు పదార్థాలు.. పిండిపదార్థాల కన్నా రెండున్నర రెట్లు అధికంగా శక్తినిస్తాయి. ఒక గ్రాము కొవ్వు దాదాపు 9 కిలోల క్యాలరీ ఉష్ణ శక్తిని ప్రసాదిస్తాయి. వేరుశనగ పిండి, కొబ్బరి పిండి, నూనెగింజల చెక్క, గోదుమ తవుడు, వరి తవుడు లాంటి పదార్థాల్లో కొవ్వుపదార్థాలు ఎక్కువగా ఉంటాయి.


మేతకు గొర్రెల మందను తరలిస్తున్న గొర్రెలకాపర్లు

నీరు..

మేత లేకుండా పశువులు మూడు నెలల పాటు బతకగలిగినా నీరు లేకుండా ఐదు రోజులకు మించి బతకలేవు. నీరు శరీర జీవక్రియలకు, ఉత్పాదకతకు ఎంతగానో ఉపయోగపడుతుంది. నీరు.. ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి, పోషక పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలను శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి, శ్వాసప్రక్రియ కొనసాగడానికి, శరీరద్రవాల పీచు సాధారణ స్థాయిలో ఉండేందుకు, చర్మం సాగే గుణం కలిగి ఉండడానికి, జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైముల తయారీకి, వ్యర్థ పదార్థాల విసర్జన క్రియలో దోహదపడుతుంది.

రోజుకు 50 నుంచి 60 లీటర్లు..

శరీరంలోని మాంసపుకృత్తులు, కొవ్వు పదార్థాలు, పిండిపదార్థాల ఆక్సిడేషన్ వల్ల కూడా అర లీటరు నుంచి లీటరు వరకు నీరు ప్రతీ పోషకపదార్థం తరపున లభ్యమవుతుంది. శరీరంలో నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధ వ్యాధులు, అజీర్తి, మలబద్ధకం తదితర సమస్యలు వస్తాయి. మలిన పదార్థాలు విసర్జించబడవు. పశువులు డీహైడ్రేషన్‌కు గురై మరణిస్తాయి. అందుకే నీరు కూడా పశువులకు అత్యవసరమయ్యే పోషక పదార్థాల్లో ఒకటిగా గుర్తించాలి. పశువులు తాగేందుకు రోజుకు 50–60 లీటర్ల నీరు అవసరం.

ముందస్తు జాగ్రత్తలు అవసరం..



శీతాకాలంలో పశువులు, గొర్రెలు, మేకలు పెంచే వారు ముందస్తు జాగ్రత్తలు పాటించడం అవసరం. లేకపోతే మూగజీవాలు వ్యాధుల బారినపడే అవకాశం మెండుగా ఉంటుంది. ఏదైనా వ్యాధి సోకిన వాటికి సులువుగా జీర్ణమయ్యే ఆహారం అందివ్వాలి. వ్యాధులు సోకిన గొర్రెలు, మేకలను మందలో కలపకూడదు. అలాగే ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లకూడదు. వ్యాధి నుంచి కోలుకున్న తర్వాత మాత్రమే మందలో కలపాలి. ఒకవేళ ఏదైనా వ్యాధితో గొర్రె లేదా మేక చనిపోతే కబేళాలను ఊరికి దూరంగా తీసుకెళ్లి, లోతు గొయ్యి తవ్వి పూడ్చిపెట్టాలి.

–ఎల్.విష్ణు, ఏడీ, పశుసంవర్థక శాఖ, బొబ్బిలి

సూపర్ సిక్స్ అమలెప్పుడు బాబూ?

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

రామభద్రపురం: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారని సీఎం చంద్రబాబును సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు ప్రశ్నించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల హామీలు అమలు చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శుక్రవారం ధర్నాకు దిగారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అధికారమే పరమావధిగా హామీలను ఎరచూపి ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోను మడతపెట్టి అటకెక్కించారన్నారు. పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఇస్తామని చెప్పి, ఏడు నెలలవుతున్నా ఇప్పటికీ ఏమీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు ఒక్క రూపాయి పెంచబోమని చెప్పిన కూటమి నాయకులు ఆ విషయం మరిచిపోయి రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి వినియోగదారుల నడ్డి విరిచారన్నారు. ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్ల వరకు గత ప్రభుత్వం ఇచ్చిన ఉచిత విద్యుత్ సదుపాయం కూడా ఎత్తివేసి వారితో బిల్లులు కట్టించాలని చూస్తుండడం దుర్మార్గమన్నారు. అనంతరం తహసీల్దారు సులోచనరాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సామిరెడ్డి లక్ష్మణ్‌నాయుడు, సోంబార్కి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వాలీబాల్ పోటీలు

వంగర: మండలంలోని కొప్పర గ్రామంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు శ్రీవేంకటేశ్వర యూత్ సభ్యులు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే వారు ఫోన్ నంబర్ 8886838162ను సంప్రదించి, జట్ల వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

సందడే సందడి!


వంగర: ప్రభుత్వ పాఠశాలలో భోగిమంట వేసి, ముందస్తు సంక్రాంతి వేడుకలు


వంగర: గ్రామ వీధుల్లో డూడూ బసవన్న సందడి


రామభద్రపురం: గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు

గ్రామీణ ప్రాంతాలకు పండగ కళ వచ్చేసింది.. ఏ ఊరు చూసినా సందడే సందడి.. సంక్రాంతి అనగానే.. భోగిమంటలు, ఆకర్షించే రంగవల్లులు, అందంగా అలంకరించిన గొబ్బెమ్మలు, ఘుమఘుమలాడే పిండివంటకాలు, హరిదాసు కీర్తనలు, డూడూ బసవా విన్యాసాలు ఇలా అన్నీ ప్రతిబింబిస్తాయి. మరో మూడు రోజుల్లో సంక్రాంతి రానుండడంతో గ్రామగ్రామాన పండగ వాతావరణం నెలకొంది. హడావిడిగా మార్కెట్‌కు వెళ్లి పూజసామగ్రి కొనుగోలు చేయడం దగ్గర నుంచి ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులు, విద్యాసంస్థల్లో భోగిమంటలు వేసి ముందస్తు వేడుకలు జరుపుకోవడం వరకు పండగ సరదా మొదలుకావడం కనిపిస్తుండడం విశేషం. –బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్


వంగర: రాజులగుమ్మడలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు


సంతకవిటి: మందరాడలో మట్టి కుండల అమ్మకాలు


సంతకవిటి: గ్రామాల్లో విక్రయించేందుకు కుండలు పట్టుకువెళ్తున్న వ్యాపారులు


బొబ్బిలి: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులపై భోగిపళ్లు పోస్తున్న దృశ్యం

ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు


రాజాం: రాజగోపాలస్వామి ఆలయంలో పూజలందుకున్న స్వామి వారు


రాజాం: అంతకాపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఉత్తరద్వారం వద్ద క్యూలైన్‌లో భక్తులు

వాడవాడలా ముక్కోటి ఏకాదశి పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హిందువులకు అత్యంత పవిత్రమైన ఈ వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తరద్వార దర్శనం ద్వారా స్వామి వారిని దర్శించుకుంటే జన్మజన్మల పాపాలు తొలగి, పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ నేపథ్యంలో భక్తులంతా శుక్రవారం ఆలయాల్లో విష్ణుమూర్తిని దర్శించుకుని, పూజ చేసి ఉపవాసం ఆచరించారు. ఇలా చేస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయన్నది అందరి విశ్వాసం.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్


సంతకవిటి: మిర్తివలసలో ప్రత్యేకాలంకరణలో శ్రీసంపత్ వేంకటేశ్వరస్వామి


రాజాం సిటీ: రాజాం తెలగవీధి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి దర్శనం


బొబ్బిలి కంచర వీధి ఆలయంలో పూజలందుకున్న శ్రీమహావిష్ణువు ఆలయంలో వెంకటేశ్వర స్వామి


రేగిడి: పనసలవలస వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తుల పూజలు


బొబ్బిలి: బొబ్బిలిలోని మహరాణిపేటలోని వైభవ వేంకటేశ్వరాలయంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి పూజలు


రామభద్రపురం: బూసాయవలస వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న పూజారి


తెర్లాం: గంగన్నపాడులో పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి


బాడంగి: పాల్తేరులో పుష్పాలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి

సంక్షిప్తంగా...

కౌలురైతులకు రుణాలు ఇవ్వండి

రేగిడి: కౌలురైతులకు రుణాలు మంజూరు చేయాలని ఏవో జి.మురళీకృష్ణ బ్యాంకు అధికారులకు సూచించారు. ఉంగరాడమెట్ట, ఉనుకూరు ఏపీజీవీబీ, రేగిడి యూనియన్ బ్యాంకు, దేవుదళ ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్లను ఏవో శుక్రవారం కలిసి రైతుల జాబితా అందించారు. ప్రతీ రైతు సాగుకు రుణం అందించి, ఆదుకోవాలని కోరారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ ఉండాలి

రాజాం సిటీ: రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసరావు.. పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని బొద్దాం, పెనుబాక, గార్రాజుచీపురుపల్లి, అంతకాపల్లి గ్రామాల్లోని గ్రామ సచివాలయాలను ఆయన శుక్రవారం సందర్శించి, సచివాలయాల ద్వారా గ్రామంలోని ప్రజలకు అందిస్తున్న ధ్రువీకరణ పత్రాలు, సేవల వివరాలు రికార్డుల్లో పొందుపర్చాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో చేపడుతున్న సీనియర్ సిటిజన్ సర్వే, హౌస్ హోల్డ్ సర్వేలపై దృష్టిపెట్టాలన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగంలోకి తీసుకురావాలి

రాజాం సిటీ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త సంపద తయారీ కేంద్రాలు)లను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని పొగిరి, కంచరాం, అంతకాపల్లి తదితర గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీలను ఆయన శుక్రవారం పరిశీలించా రు. కేంద్రాల వద్ద పూలమొక్కలు, కూరగాయలు సాగు చేయాలని ఆయన తెలిపారు. సేంద్రియ ఎరువులు తయారు చేసి, సబ్సిడీపై వాటిని రైతులకు అందజేసి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పశువ్యాధులపై అవగాహన

రాజాం సిటీ: మండలంలోని ఒమ్మి గ్రామంలో పశువ్యాధులు, వాటి నివారణ చర్యలపై పాడిరైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి అనుసరించాల్సిన విధానాలను జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వైద్యుడు శరత్‌చంద్ర వివరించారు. పశువులకు గర్భకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రభుత్వం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల్లో వాటికి చికిత్స చేయించుకోవాలన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 82 పాడి పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స చేయించారు. కార్యక్రమంలో పొగిరి పశువైద్యులు రాజేశ్వరి, దీపిక తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లి గ్రామ వెల్‌నెస్ సెంటర్ పరిధిలోని పలు గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. వ్యాధి నివారణకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తూ క్షయవ్యాధి లక్షణాలు, వాటి నివారణ చర్యలపై చైతన్యం చేస్తున్నామని ఎయిడ్స్, టీబీ కంట్రోల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ జస్వంత్ తెలిపారు. అనుమానితులకు ఎక్స్‌రేల ద్వారా కఫం పరీక్షలు చేస్తున్నామని, నిర్ధారిత రోగులకు మందులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ సూపర్‌వైజర్ ఆర్.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

బొబ్బిలిరూరల్: గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా వెలుగులోకి వచ్చి భూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దారు మల్లపురెడ్డి శ్రీను సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌వోలతో శుక్రవారం సమావేశమైన ఆయన.. నెలరోజుల పాటు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఇచ్చిన అర్జీల్లోని సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో హెచ్‌డీటీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పనులు

బొబ్బిలి: మున్సిపాలిటీలోని ఫ్లైఓవర్, డివైడర్లకు నాణ్యమైన పెయింటింగ్ వేసే పనులను చాలా పారదర్శకంగా చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు తెలిపారు. ఇదే విషయమై ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. రెండేళ్ల క్రితం జరిగిన కౌన్సిల్ తీర్మానంలో ఆమోదించిన పనులను కూడా నాణ్యంగా చేయిస్తున్నామన్నారు. ఏఈ, డీఈఈలతో కలిసి ఫ్లైఓవర్ పరిశీలించామన్నారు.

దుస్తుల వితరణ

బాడంగి: స్థానిక ఎంఆర్‌సీ భవనం వద్ద మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న తల్లిదండ్రులు లేని పిల్లలకు శుక్రవారం దుస్తులు వితరణ చేశారు. మండలంలోని ఉపాధ్యాయులంతా చందాల రూపంలో పోగు చేసిన సొమ్ముతో వాటిని కొనుగోలు చేసి, అందిస్తున్నట్లు ఎంఈవోలు లక్ష్మణరావు, రాజేశ్వరి తెలిపారు.

అంతర పంటలు వేసుకోవాలి

బొబ్బిలిరూరల్: అదనపు ఆదాయం కోసం ప్రధాన పంటలో అంతర పంటలు వేసుకుని, పండించాలని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ తెలిపారు. మండలంలోని కృష్ణాపురం రైతు సేవా కేంద్రం పరిధిలో రైతులతో రీజనల్ అధికారి ప్రకాష్‌తో కలిసి ఆయన శుక్రవారం సమావేశమై పలు సూచనలు చేశారు. వరి కోతలు చేసిన తర్వాత అపరాల పంటలు సాగు చేయడంతో పాటు అంతర పంటలుగా కూరగాయలు పండిస్తే ఆదాయం సమకూరుతుందన్నారు. నువ్వు పంటలో అంతర పంటలుగా గోంగూర, చిక్కుడు, గంటిలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పల్లెలు పరిశుభ్రంగా ఉంచాలి

బాడంగి: సంక్రాంతి పండగ వేళ పల్లెలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశమైన ఆయన.. పల్లెపండుగ పనులు పూర్తి చేయాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. చెత్తను ఎప్పటికప్పుడు గ్రీన్‌అంబాసిడర్ల ద్వారా ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాలన్నారు.

రూ.300 వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు

తెర్లాం: ఉపాధి హామీ పథకంలో పనుల్లో వేతనదారులకు రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యేలా వేతనం వచ్చేలా పనులు చేయించాలని ఆ పథకం ఏపీడీలు మీసాల శ్రీనివాసరావు, కోట చిన్నంనాయుడు సూచించారు. మండలంలోని జగన్నాథవలస గ్రామంలో తెర్లాం, రాజాం, రేగిడి ఆమదాలవలస, వంగర మండలాల్లోని క్షేత్ర సహాయకులకు ఒక్కరోజు శిక్షణ శుక్రవారం ఇచ్చారు. ఉపాధి హామీ పథకం, పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్ ఆదేశాల మేరకు నాలుగు మండలాల్లోని క్షేత్ర సహాయకులందరికీ క్షేత్రస్థాయి శిక్షణ ఇచ్చామని, వేతనదారులకు వేతనం గిట్టుబాటు అయ్యేలా కొలతల ప్రకారం పనులు చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో తెర్లాం, రాజాం, రేగిడి ఆమదాలవలస, వంగర మండలాల ఉపాధి ఏపీఓలు కె.సుశీల, సత్యవతి, సీతారాం, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.